ధాన్యం స్కాం.. 1100 కోట్లు!

మొదటిపేజీ తరువాయి...

మండిపడ్డారు. 'బయట రూ.35, రూ.42కు దొరుకుతున్న సన్న బియ్యాన్ని మీరు టెండర్ పెట్టి రూ.57కు కొనాల్సిన అవసరం ఏమిటి? ఆ టెండరు రద్దు అయిందా? లేదా? అని కమలాకర్ అడిగితే దానికీ సమాధానం ఇవ్వలేదు. సివిల్ సప్లయ్ డిపార్ట్‌మెంట్‌లో పారదర్శకంగా టెండర్ పిలిచామని చెప్పారు. టెండర్ వేసిన ఆ నలుగురు ఎవరు? వాళ్లు బియ్యం ఎందుకు సేకరించడం లేదు? డబ్బులు ఎందుకు వసూలు చేస్తున్నారు?' అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఎవరెవరి దగ్గర ఎంతెంత వసూలు చేస్తున్నారో తమ దగ్గర స్పష్టమైన ఆధారాలు ఉన్నాయన్నారు. అందుకే హౌస్ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తున్నామని చెప్పారు. 'ఇది చిన్న స్కామ్ కాదు.. రూ.1100 కోట్ల కుంభకోణం మంత్రికి తెలియకుండానే ఈ ప్రభుత్వంలో చాలా జరుగుతున్నాయి. రూ.1100 కోట్ల కుంభకోణంపై తప్పకుండా హౌస్ కమిటీ వేయాలి. మేము చెప్పేంది మీకు రుచించాలని ఏమీ లేదు. కానీ, అధికారం ఉంది కాదా అని బుల్డోజ్ చేస్తామడం సరికాదు' అని మండిపడ్డారు. ప్రభుత్వం సమాధానం సంతృప్తికరంగా లేదు కాబట్టి సభ నుంచి వాకౌట్ చేస్తున్నామని కేటీఆర్ చెప్పారు.

నేను డిస్టర్బ్ చేయలేదు.. నన్ను డిస్టర్బ్‌చేయొద్దు

ధాన్యం కొనుగోలు విషయంలో గంగుల కమలాకర్ మాట్లాడుతుండగా కాంగ్రెస్ సభ్యులు సభలో అడ్డుకునే ప్రయత్నం చేశారు. దీంతో ఆయన 'నేను 2004 నుంచి వరుసగా గెలుచుకుంటూ వచ్చాను. నేనెవర్నీ డిస్టర్బ్ చేయలేదు..నన్నెవరూ డిస్టర్బ్ చేయొద్దు. ఏదైనా చెప్పదలచుకుంటే నా ప్రసంగం పూర్తయ్యాక వివరణలో చెప్పండి' అని సూచించారు.

ధాన్యం కొనుగోళ్లలో గోల్‌మాల్

ప్రభుత్వం నిర్వహించిన ధాన్యం కొనుగోలు టెండర్లలో గోల్‌మాల్ జరిగిందని మాజీ మంత్రి గంగుల కమలాకర్ అనుమానం వ్యక్తం చేశారు. ఈ అంశంపై సభాసంఘం వేసి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. టెండర్లలో క్వింటాలు రూ. 2,007కు కోట్ చేస్తే మిల్లర్ల నుంచి రూ.2,223 వసూలు చేశారని ఆరోపించారు. అదనంగా రూ. 220 చొప్పున వసూలు చేసిన మొత్తం రూ.750 కోట్లు ఎక్కడికి పోయాయో చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం అసెంబ్లీలో బడ్జెట్‌పై పద్దుల చర్చలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ హయాంలో తీసుకొచ్చిన సంస్కరణల ఫలితంగా ధాన్యం ఉత్పత్తి, సేకరణ గణనీయంగా పెరిగిందని తెలిపారు. 2020లో కరోనా సమయంలోనూ 1.41 కోట్ల టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని చెప్పారు. ఆ సమయంలో పౌర సరఫరాలశాఖ మంత్రిగా తాను ఉన్నందుకు గర్వపడుతున్నానని పేర్కొన్నారు. 2023-24లో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే స్విచ్‌ఆఫ్ చేసినట్టు ధాన్యం కొనుగోళ్లు 41లక్షల టన్నులకు పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఈసీ ఆదేశాల మేరకే టెండర్లు తెరవలేదు

కేసీఆర్ పాలనలో రాష్ట్రంలో సాగు విస్తీర్ణం, ధాన్యం ఉత్పత్తి గణనీయంగా పెరిగినా మిల్లింగ్ సామర్థ్యం ఆ స్థాయిలో పెరగలేదని గంగుల తెలిపారు. ఈ నేపథ్యంలో మిల్లుల్లో పేరుకుపోతున్న నిల్వలను ఖాళీ చేస్తే కొత్త నిల్వలు పెట్టొచ్చన్న ఉద్దేశంతో ధాన్యం బహిరంగ వేలానికి గ్లోబల్ టెండర్లు పిలిచినట్టు చెప్పారు. రైతులకు క్వింటా ఉత్పత్తికి రూ.2,500 ఖర్చు అవుతుండగా, కంపెనీలు రూ.1800 మాత్రమే ఇస్తామని కోట్ చేయడంతో మరోసారి టెండర్లు పిలిచినట్టు వివరించారు. సరిగ్గా అదే సమయంలో ఎన్నికల కోడ్ రావడంతో కొనుగోలు వద్దని కాంగ్రెస్ నేతలు ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారని గుర్తుచేశారు.ఈసీ ఆదేశాలతో టెండర్లు ఓపెన్ చేయలేదని తెలిపారు.

ఆ నలుగురు కాంట్రాక్టర్లు ఎవరు?

గోదాముల్లో కోటి టన్నుల ధాన్యం నిల్వ ఉంటే తాజాగా ప్రభుత్వం 35 లక్షల టన్నుల ధాన్యానికి మాత్రమే టెండర్లు పిలిచిందని గంగుల గుర్తు చేశారు. నలుగురు కాంట్రాక్టర్లకు మాత్రమే టెండర్లు దక్కేలా ఏర్పాట్లు జరిగాయని అనుమానం వ్యక్తం చేశారు. ఆ నలుగురు ఎవరని, వారి వివరాలు వెల్లడించాలని డిమాండ్ చేశారు. 35 లక్షల టన్నులను ఖాళీ చేయాలని టెండర్లకు పిలిస్తే ఇప్పటి వరకు కనీసం 35 కిలోలు కూడా ఖాళీ చేయలేదని మండిపడ్డారు. 35 లక్షల టన్నుల ధాన్యానికి 7 లక్షల టన్నులకు మాత్రమే డబ్బులు కట్టారని, మిగతా సొమ్ము సర్కారు ఖజానాకు ఎప్పుడు వస్తుందని ప్రశ్నించారు. ప్రభుత్వం 1.59 లక్షల టన్నుల సన్నవడ్లను పట్టించి హాస్టళ్లకు ఇస్తే కిలోకు రూ.32 నుంచి రూ.33 వరకు ఖర్చయ్యేదని తెలిపారు. మిల్లర్ల నుంచి ప్రభుత్వం రూ.56 కు సన్నబియ్యం కొనుగోలు చేసిందని ధ్వజమెత్తారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఒకవేళ తన హయాంలో తప్పులు జరిగాయని భావిస్తే సభాసంఘం ఏర్పాటుచేసి విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

మానేరు రివర్ ఫ్రంట్ కొనసాగించండి

రూ.450 కోట్ల ఇరిగేషన్ నిధులతో, రూ.100 కోట్ల టూరిజంశాఖ నిధులతో కరీంనగర్‌లో మానేరు రివర్‌ఫ్రంట్ ప్రాజెక్టును చేపట్టామని గంగుల తెలిపారు. రూ.470 కోట్లతో రీటెయినింగ్ వాల్స్ నిర్మించగా, మరో రూ.100 కోట్ల పనులు కొనసాగినట్టు చెప్పారు. ప్రభుత్వం మారిన వెంటనే ఆ పనులను నిలిపివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫార్మాసిటీ భూములను రైతులకు ఎప్పుడు తిరిగిస్తరు?

మూసీ సుందరీకరణకు లక్షా 50వేల కోట్లెందుకు?

హైదరాబాద్‌లో ఎస్సార్డీపీ పనులు కొనసాగించాలి

శాసనసభలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ): తమ ప్రభుత్వం హైదరాబాద్‌లో ఫార్మాసిటీ ఏర్పాటుకు ప్రయత్నిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం దాన్ని కొనసాగించటంలేదని బీఆర్ఎస వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. ఫార్మాసిటీ కోసం ముచ్చర్ల సహా పలు గ్రామాల్లో దాదాపు 12 వేల ఎకరాలు సేకరించామని చెప్పారు. శాసనసభలో పద్దులపై మంగళవారం జరిగిన చర్చలో భాగంగా కేటీఆర్ మాట్లాడుతూ ఫార్మాసిటీని రద్దు చేసినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం పలుమార్లు ప్రకటించిందని, రద్దు చేస్తే రైతులకు వారి భూములను ఎప్పుడు తిరిగిస్తరో చెప్పాలని డిమాండ్ చేశారు. గతంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, కోదండరెడ్డి ఫార్మాసిటీ భూములను రైతులకు తిరిగిస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. మూసీనది సుందరీకరణలో కీలకమైన సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను తమ ప్రభుత్వం వందశాతం పూర్తిచేసిందని చెప్పారు. మూసీ సుందరీకరణకు రూ.16 వేల కోట్లతో తమ ప్రభుత్వమే డిజైన్లు కూడా పూర్తి చేసిందని వివరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో మూసీ సుందరీకరణకు రూ.50 వేల కోట్లు అని ఒక మంత్రి అంటే, పర్యాటక శాఖ మంత్రి రూ.75 వేల కోట్లు అని చెప్పారని, ఇటీవల గోపన్‌పల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి ఏకంగా లక్షా 50 వేల కోట్లు అని పేర్కొన్నారని సభదృష్టికి తెచ్చారు. రూ.16 వేలకోట్లతో ఈస్ట్, వెస్ట్ ఎక్స్‌ప్రెస్ హైవేతో పాటు మూసీ సుందరీకరణ పూర్తికి తమ ప్రభుత్వం అన్నీ సిద్ధం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రాజెక్టు ఖర్చును ఏకంగా లక్షా50 వేల కోట్లకు ఎందుకు పెరిగిందో చెప్పాలని, డీపీఆర్‌ను ప్రజల ముందు పెట్టాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

బ్రిడ్జిలను ఎందుకు ఆపారు?

హైదరాబాద్‌లో ఎస్సార్డీపీ, ఎస్ఎన్డీపీ ప్రాజెక్టుల పనులు పూర్తిగా నిలిచిపోయాయని, ఎనిమిది నెలలుగా ఫ్లై ఓవర్లు, బ్రిడ్జిల నిర్మాణం ఆపేశారని, బిల్లులు చెల్లించకపోవటం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని, వెంటనే బిల్లులు చెల్లించి పనులు పూర్తి చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఎలివేటెడ్ కారిడార్లు పూర్తి చేస్తామని ఘనంగా ప్రచారం చేసుకుంటున్న ఈ ప్రభుత్వం, హెచ్ఎమ్‌డీఏకు బడ్జెట్‌లో కేవలం రూ.700 కోట్లే కేటాయించిందని, రూ.5 వేల కోట్లు ఖర్చయ్యే ప్రాజెక్టులను ఈ నిధులతో ఎలా పూర్తిచేస్తారో చెప్పాలని ప్రశ్నించారు.

బడ్జెట్‌పై ఎక్కువ రోజులు చర్చించాలి: కేటీఆర్

హైదరాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ): అసెంబ్లీ సమావేశాలు మంగళవారం ఉదయం 10 గంటలకు ప్రారంభం కాగానే 19పద్దులపై చర్చను ప్రారంభించే ముందు స్పీకర్ గడ్డం ప్రసాద్ సభ్యులకు పలు సూచనలు చేశారు. సభ్యులందరూ కేటాయించిన 15 నిమిషాల్లోగా ముగించాలని సభ్యులకు సూచించారు. శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు కూడా ఇదే విషయాన్ని ఊటంకించారు. నిర్ణీత గడువును పాటించి సహకరించాలని ప్రభుత్వ, విపక్ష సభ్యులకు సూచించారు. దీనిపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిండెంట్ కేటీఆర్ వెంటనే స్పందించారు. సభలో అధికారపక్షం నుంచి, విపక్షాల నుంచి కూడా ఈసారి ఎన్నికైన వారిలో ఎక్కువ మంది కొత్త సభ్యులు ఉన్నారని, బడ్జెట్‌పై చర్చలో పాల్గొనాలని ఆసక్తి చూపుతున్నారని వివరించారు. ఒకేరోజున అనేక పద్దులపై చర్చ పెట్టడం తగదని, రాబోయే రోజుల్లోనైనా బడ్జెట్‌పై చర్చించేందుకు అసెంబ్లీ సమావేశాలను ఎక్కువ రోజులు కేటాయించాలని కోరారు. రోజుకు రెండు అంశాలపై చర్చకు అవకాశముండేలా చూడాలని మంత్రిని, స్పీకర్‌ను ఈ సందర్భంగా కేటీఆర్ కోరారు.

బీఆర్ఎస్ గెలిస్తే హోంమంత్రి ఐతుండే!

సినిమాలు తీస్తుండే.. చానల్ పెడ్తుండే

చిట్‌చాట్‌లో మాజీ మంత్రి మల్లారెడ్డి

హైదరాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ మాజీ మంత్రి మల్లారెడ్డి మంగళవారం అసెంబ్లీ లాబీ ల్లో జర్నలిస్టులతో చిట్‌చాట్ నిర్వహించి.. బీఆర్ఎస్ గెలిస్తే జరిగే పరిణామాలపై చర్చించారు. 'గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే తాను హోంమంత్రి అవుతుండేనని, సినిమాలు తీసి, టీవీ చానల్ పెడుతుండే' అని అన్నారు.

సీపీఐ, బీజేపీ వాయిదా తీర్మానాల తిరస్కరణ

అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా మంగళవారం బీజేపీ, సీపీఐ పలు అంశాలపై వాయిదా తీర్మానాలను అందజేయగా స్పీకర్ గడ్డం ప్రసాద్ తిరస్కరించారు. రాష్ట్రంలో విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై చర్చించాలని సీపీఐ వాయిదా తీర్మానాన్ని కోరింది. రాష్ట్రవ్యాప్తంగా జ్వరాలు ప్రబలుతున్నాయని బీజేపీ వాయిదా తీర్మానాన్ని అందజేసింది. రెండింటినీ స్పీకర్ తిరస్కరించారు.

గంగుల వర్సెస్ ఉత్తమ్

రేషన్‌కార్డులు, ధాన్యం కొనుగోళ్లపై వాగ్వాదం • సభాసంఘం ఏర్పాటు చేయాలన్న గంగుల

హైదరాబాద్, జూలై 30(నమస్తే తెలంగాణ): ధాన్యానికి రూ. 500 బోనస్ చెల్లింపు, కొత్త రేషన్ కార్డులు, ధాన్యం కొనుగోళ్లలో అక్రమాలు తదితర అంశాలపై మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి గంగుల కమలాకర్ మధ్య సభలో వాగ్వాదం చోటు చేసుకుంది. గతంలో కొనుగోలు చేసిన ధాన్యంలో 50 శాతం స్టాక్ మిల్లర్ల వద్ద మిస్సయినట్టు విచారణలో తేలిందని ఉత్తమ్ ఆరోపించారు. మంగళవారం పద్దులపై చర్చ సందర్భంగా శాసనసభలో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ.. ''రుణమాఫీ అనేది దేశంలోనే ఒక రికార్డు. 80-90శాతం పూర్తయిన ప్రాజెక్టులను పూర్తిచేస్తాం. ఎల్వీజీ కనెక్షన్ ఉండి, తెలుపు రేషన్‌కార్డు ఉన్న అందరికీ రూ. 500కు సిలిండర్ ఇవ్వడానికి కట్టుబడిఉన్నాం. వినియోగదారులు రూ. 500 చెల్లించి సిలిండర్ తీసుకునేలా ఆయిల్ కంపెనీలకు అడ్వాన్స్‌గా చెల్లింపులు చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు..

కొత్త రేషన్ కార్డులపై విధివిధానాలు

కొత్త రేషన్‌కార్డుల జారీపై ఎల్లుండి క్యాబినెట్‌లో విధివిధానాలు ఫైనలైజ్ చేయనున్నట్టు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. అర్హత ఉన్నవారికి అందరికీ రేషన్ కార్డులు ఇస్తాం. అతి త్వరలో రేషన్‌లో సన్నబియ్యం కూడా ఇవ్వబోతున్నట్టు చెప్పారు. దొడ్డు బియ్యం 50 శాతం మిస్‌యూజ్ అవుతున్నాయని తెలిపారు. అందుకనే రేషన్ ద్వారా సన్న బియ్యం ఇవ్వాలని క్యాబినెట్‌లో నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు.

పదేండ్లలో కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదు

తెలంగాణ ఏర్పడినప్పుడు రాష్ట్రంలో 91,68,231 కార్డులు ఉండగా, నేడు 89,96,000కార్డులు మాత్రమే ఉన్నాయని మంత్రి పేర్కొన్నారు. గత పదేండ్లలో ఎక్కడా కొత్త రేషన్ కార్డులు ఇవ్వలేదని విమర్శించారు. క్యాబినెట్ సబ్ కమిటీలో విధివిధానాలు, ఇన్‌కమ్ లిమిట్, ల్యాండ్ హోల్డింగ్ తదితర అంశాలను ఫైనలైజ్ చేస్తామని వివరించారు. ధాన్యం వేలంలో తెలంగాణ వారే పాల్గొనాలన్న నిబంధనలు పెట్టామని గుర్తుచేశారు. సన్నబియ్యం వడ్లు 1.6 లక్షల టన్నులు ఉన్నాయని బీఆర్ఎస్ సభ్యులు చెప్పారని, కానీ కేవలం 40వేల టన్నులు మాత్రమే ఉన్నాయని వివరించారు. తాము నిర్వహించిన వేలంలో రూ.1100 ధర ఎక్కువ వచ్చినట్టు తెలిపారు.

నేను చెప్పింది తప్పయితే సభనుంచి వెళ్లిపోతా: గంగుల

రేషన్‌కార్డులపై మంత్రి వ్యాఖ్యలకు గంగుల సమాధానమిస్తూ తెలంగాణ ఏర్పడేనాటికి 91లక్షల రేషన్ కార్డులు ఉన్నాయనడం సరికాదన్నారు. తాము ప్రతి ఏటా కార్డులు ఇచ్చుకుంటూ 91లక్షల కార్డులకు పెంచామని వివరించారు. తాను చెప్పింది తప్పయితే సభనుంచి వెళ్లిపోతానని గంగుల సవాల్ విసిరారు. ఉత్తమ్ మాట్లాడుతూ సన్నబియ్యం, సన్నవడ్లు మార్కెట్ రేటు చాలా ఎక్కువని కాబట్టి రైతులు, రైస్ మిల్లర్లు ప్రభుత్వ సేకరణ కేంద్రాలకు రాకుండా బయట అమ్ముకున్నారని తెలిపారు. దీంతో ఒక్కసారిగా బీఆర్ఎస్ సభ్యులు ఆందోళనకు దిగారు. 35లక్షల టన్నుల ధాన్యానికి ఆక్షన్ పెడితే కాంట్రాక్టర్లు ఎవరు వచ్చారో బయటపెట్టాలని గంగుల డిమాండ్ చేశారు.

దొరికిపోయిన దొంగ ఈ ప్రభుత్వం

మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ): ధాన్యం కొనుగోళ్లలో రూ.1100 కోట్ల కుపైగా చేతులు మారినట్టు ఆరోపణలు ఉన్నాయని, దీనిపై ప్రశ్నిస్తే ప్రభుత్వం పారిపోయిందని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం సభ నుంచి వాకౌట్ అనంతరం ఆయన మీడియా పాయింట్‌లో మాట్లాడారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించిన రికార్డులను స్పీకర్ ముందు పెట్టాలని, సభా సంఘం వేయాలని నిబంధనల ప్రకారమే అడిగామని పేర్కొన్నారు. ప్రభుత్వం తిరస్కరిస్తూ తప్పించుకునే ప్రయత్నం చేసిందని విమర్శించారు. దొరికిపోయిన దొంగ ఈ ప్రభుత్వం అని మండిపడ్డారు. దొడ్డు వడ్లకు ఎమ్మెస్పీకి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి ఇప్పుడు సన్నవడ్లకే అంటూ తప్పించుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు సన్నవడ్లను బయటే అమ్ముకుంటారని, సివిల్ సప్లయిస్‌కు వచ్చే వడ్లలో 90 శాతం దొడ్డు వడ్లే ఉంటాయని చెప్పారు. ఆ రైతులను ప్రభుత్వం మోసం చేసిందని మండిపడ్డారు.

కాంగ్రెస్ పాలనలోనే రైతు ఆత్మహత్యలు

- బడ్జెట్‌లో వ్యవసాయానికి అన్యాయం
- వ్యవసాయ పాలసీ రూపకల్పనలో సర్కారు విఫలం
- రైతుభరోసా, రుణమాఫీ అమలులో అట్టర్‌ఫ్లాప్
- బీఆర్ఎస్ హయాంలోనే వ్యవసాయ స్థిరీకరణ
- వ్యవసాయ పద్దుపై చర్చలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఫైర్

ఎన్సీఆర్బీ రికార్డుల ప్రకారం 2014 నుంచి 2022 వరకు ఆత్మహత్య చేసుకున్న రైతుల వివరాలు

2014: 1340 మంది
2015: 1400 మంది
2016: 645 మంది
2017: 851 మంది
2018: 908 మంది
2019: 499 మంది
2020: 471 మంది
2021: 359 మంది
2022: 178 మంది
2023 డిసెంబర్ 9 నుంచి ఇప్పటివరకు : 204

హైదరాబాద్, జూలై 30 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ పాలనలోనే రైతు ఆత్మహత్యలు మళ్లీ పెరిగాయని, వ్యవసాయ, అనుబంధ రంగాలకు బడ్జెట్ కేటాయింపుల్లో యావత్ రైతాంగాన్ని ప్రభుత్వం తీవ్రంగా మోసం చేసిందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రకటించిన వరంగల్ రైతు డిక్లరేషన్ ప్రకారం ఎలాంటి నిబంధనల్లేకుండా పాస్‌బుక్ కలిగిన ప్రతి రైతుకు రూ.2 లక్షలలోపు పంట రుణాలను ఏకకాలంలో మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ వ్యవసాయ పాలసీని రూపొందించకపోవడం దారుణమని విమర్శించారు. రైతు భరోసా, రుణమాఫీ విషయంలోనూ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని దుయ్యబట్టారు. మంగళవారం అసెంబ్లీలో వ్యవసాయం, మార్కెటింగ్, సహకారశాఖ పద్దులపై జరిగిన చర్చలో పల్లా మాట్లాడుతూ కొత్త ప్రభుత్వం బడ్జెట్‌లో వ్యవసాయ రంగ పాలసీపై వ్యవసాయ రంగం ఎంతో ఆశగా ఎదురుచూసిందని, 40 ఏండ్ల రాజకీయ అనుభవం, వ్యవసాయంపై పట్టున్న వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు ఆ శాఖకు న్యాయం చేస్తారని ఆశించామని, కానీ నామమాత్రపు కేటాయింపులు చేసి నిరుత్సాహపరిచారని విమర్శించారు.

కేసీఆర్ పాలనలోనే వ్యవసాయ స్థిరీకరణ

బీఆర్ఎస్ ప్రభుత్వం రాగానే తెలంగాణలో వ్యవసాయాన్ని స్థిరీకరించాలనే లక్ష్యంతో నాటి సీఎం కేసీఆర్ ప్రత్యేక పాలసీ రూపొందించారని పల్లా తెలిపారు. వ్యవసాయ విధానంలో ఎంఎస్ స్వామినాథన్, అశోక్ గులాటీ, అర్వింద్ సుబ్రహ్మణ్యం లాంటి ప్రముఖులందరి సలహాలు తీసుకున్నామని, నీటి తీరువా రద్దు చేశామని చెప్పారు. ప్రాజెక్టుల కింద ఎన్ని నీళ్లు తీసుకున్నా ఒక్క పైసా వసూలు చేయలేదని, 24 గంటల ఉచిత నాణ్యమైన కరెంట్ ఇచ్చామని గుర్తుచేశారు. దేశంలోనే తొలిసారిగా రైతు బంధు అమలు చేసి 12 సార్లు ఇచ్చామని చెప్పారు. 70లక్షల మంది రైతులకు కోటీ 52 లక్షల ఎకరాలకు సంబంధించి రూ.82వేల కోట్లను దేశంలోనే ఎవరూ ఇవ్వని విధంగా ఇచ్చామని, ప్రపంచంలోనే ఇది అతిగొప్ప పథకంగా కీర్తికెక్కిందని తెలిపారు. 2014కు ముందు నేషనల్ క్రైం రికార్డుల ప్రకారం రాష్ట్రంలో ఏటా 2వేల మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని వివరించారు. రైతు కుటుంబాలకు భరోసా కల్పించాలనే లక్ష్యంతో బీఆర్ఎస్ రైతుబీమా పథకాన్ని ప్రవేశపెట్టిందని చెప్పారు. 9 ఏళ్లలో 1.40 లక్షల మంది రైతులకు రైతుబీమా అందించామని, సకాలంలో ఇన్‌పుట్ సబ్సిడీ వేశామని, బీఆర్ఎస్ తెచ్చిన సంస్కరణలతో తెలంగాణలో వ్యవసాయ స్థిరీకరణ జరిగిందని గుర్తుచేశారు. ఎన్సీఆర్బీ రికార్డు లు చూపిస్తూ గడిచిన పదేళ్లలో రైతు ఆత్మహత్యల వివరాలను వెల్లడించారు. బీఆర్ఎస్ హయాంలో రైతు ఆత్మహత్యలు గణనీయంగా తగ్గాయని టైమ్స్ ఆఫ్ ఇండియా, ఇండియన్ ఎక్స్‌ప్రెస్ సహా పలు పత్రికలు రాసిన కథనాలను ఉటంకించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక 2023 డిసెంబర్ 9 నుంచి ఇప్పటివరకు రాష్ట్రంలో 204 మంది రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తంచేశారు.

బాధిత కుటుంబాలను కనీసం పరామర్శించరా?

ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సొంత నియోజకవర్గం చింతకాని మండలం పొద్దుటూరులో బోరెడ్ల ప్రభాకర్ ఆత్మహత్య చేసుకుంటే భరోసా కల్పించేందుకు తాము వెళ్తున్న విషయం తెలుసుకొని భట్టి కూడా వచ్చారని, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు సొంత గ్రామం ఆశ్వారావుపేట మండలం అన్నపురెడ్డిపల్లిలో శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్య చేసుకున్నాడని, కొడంగల్‌లోని బొమ్మరాజుపల్లిలో బైరం నర్సింహులు, వైరాలోని ఉసిరికాలపల్లిలో పచ్చికాల భద్రయ్య అనే రైతు ఆత్మహత్యాయత్నం చేశారని మంత్రులు వారి కుటుంబాలనే పరామర్శించలేదని పల్లా ఆగ్రహం వ్యక్తంచేశారు. వ్యవసాయ యాంత్రీకరణలో భాగం గా బీఆర్ఎస్ ప్రభుత్వం 13వేల ట్రాక్టర్లను సబ్సిడీ కింద ఇచ్చిందని, రైతు వేదికలు నిర్మించామని, 2,600 మందిని ఏఈవోలుగా నియమించామని, ఇవన్నీ చేయడంతో దేశంలో తెలంగాణ వరి పండించడంలో నంబర్ వన్ స్థానానికి చేరిందని వివరించారు.

అన్ని రాష్ట్రాలను దాటేసినం..

ఒకప్పుడు ఎకరాకు 15 నుంచి 16 క్వింటాళ్ల ధాన్యం పండితే ఇప్పుడు 25 నుంచి 30 క్వింటాళ్లు పండుతున్నదని, 3 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం ఉత్పత్తితో పంజాబ్, హర్యానా, ఉత్తరప్రదేశ్ సహా అన్ని రాష్ట్రాలను దాటేసి తెలంగాన నంబర్ 1కు చేరిందని గుర్తుచేశారు. నాడు 131లక్షల ఎకరాలు సాగైతే ప్రస్తుతం 210 లక్షల ఎకరాలు సాగవుతున్నాయని వివరించారు. ధాన్యం సేకరణలో 2014లో 24 లక్షల మెట్రిక్ టన్నులుంటే గతేడాది 141 లక్షల టన్నులు సేకరించారని చెప్పారు. ఇప్పుడు రైతుబంధు ఇవ్వకపోవడంతో వ్యవసాయ రంగం తిరోగమనంలోకి వెళ్లిందని, మద్దతు ధర కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. జనగామలో క్వింటాల్‌కు రూ.2087 ఉంటే జనగామ మార్కెట్‌లో రూ.1530 ఇచ్చారని ఉదహరించారు. దీనిపై సీఎం స్పందించి అధికారులను అప్రమత్తం చేస్తే రూ.1560కి పెంచారని గుర్తుచేశారు.

వరంగల్ రైతు డిక్లరేషన్ ఏమైంది?

కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్‌లో ప్రకటించిన రైతు డిక్లరేషన్‌ను ఎప్పుడు అమలు చేస్తారని పల్లా ప్రశ్నించారు. కౌలు రైతులకు రూ.15 వేల రైతుభరోసా ఇస్తామన్నారని, ఇందుకు మార్గదర్శకాలను రూపొందించారా? అని, ఎప్పటి నుంచి అమలు చేస్తారో స్పష్టం చేయాలని నిలదీశారు. 60 లక్షల మందికి ఉపాధి హామీ జాబ్ కార్డులు ఉన్నాయని, వారందరికీ కౌలు రైతుల కిచ్చే రుణమాఫీని అమలు చేస్తారా? అని ప్రశ్నించారు.

ఫసల్ బీమాతో ప్రయోజనం తక్కువే

కేంద్రం అమలు చేస్తున్న ఫసల్ బీమా యోజనాతో రైతులకు ప్రయోజనం లేదని, రైతులు చెల్లించే దానికంటే ఇన్సూరెన్స్ సంస్థలు చెల్లించే పరిహారం చాలా తక్కువ ఉండటం వల్లే ఆ పథకం నుంచి అప్పటి ప్రభుత్వం తప్పుకున్నదని పల్లా వివరించారు. తెలంగాణనే కాకుండా గుజరాత్, కర్నాటక, తమిళనాడు, జార్ఖండ్, కేరళ వంటి రాష్ట్రాలు కూడా ఈ పథకం నుంచి బయటకి వచ్చాయని గుర్తుచేశారు. 2016 నుంచి 2021 వరకు రైతులు రూ.2150 కోట్లు ప్రీమియం చెల్లిస్తే ఇన్సూరెన్స్ సంస్థ రూ.1871 కోట్లే చెల్లించిందని వివరించారు.

రుణమాఫీలో నిధులెందుకు తగ్గినయ్?

బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.లక్ష రుణమాఫీ చేసినప్పటి కంటే కాంగ్రెస్ ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి నిధులు తగ్గించడం వెనుక మర్మమేమిటో చెప్పాలని పల్లా డిమాండ్ చేశారు. రుణమాఫీకి రూ.41వేల కోట్లు కావాలని ప్రకటించిన ప్రభుత్వం ఆ తర్వాత రూ.31వేల కోట్లుగా పేర్కొని, బడ్జెట్‌లో రూ.26వేల కోట్లకే తగ్గించిందని చెప్పారు. బీఆర్ఎస్ ప్రభుత్వం 4.5 లక్షల మంది పోడు రైతులకు రైతుబంధుతోపాటు, రైతుబీమా చెల్లించిందని, మొదటి విడత రూ.లక్ష రుణమాఫీకి రూ.16,144కోట్లు, రెండో విడత రూ.లక్ష రుణమాఫీకి రూ.19వేల కోట్లు ఖర్చు చేస్తే కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షల రుణమాఫీకి కేవలం రూ.26వేల కోట్ల లెక్క చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.

అప్పుల బాధతో యువ రైతు ఆత్మహత్య

మిర్చిపంట పండక నష్టం వచ్చి మనస్తాపం • అప్పు తీర్చే మార్గం కనిపించక బలవన్మరణం

టేకులపల్లి, జూలై 30: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం కోయగూడెం గ్రామంలో యువ రైతు జాల ఉపేందర్ (32) సోమవారం రాత్రి పురుగుల మందుతాగి